

అక్రమ నిర్మాణాలను..

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని షాబాద్ తహసీల్దార్ ఎండీ అన్వర్ హెచ్చరించారు.

8లో▸



బీజాపూర్ హైవే పరిశీలన

హైదరాబాద్–బీజాపూర్ హైవే ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని సీపీఐ కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు.

8లో▸



పేదలకు ఫీజులో రాయితీ..

విద్యార్థులు ఇష్టపడి చదువుకుని ఉన్నతంగా రాణించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.

8లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

హుడాకాంప్లెక్స్: హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని బాలుర, బాలికల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు జోన్–6 జోనల్ అధికారిణి నిర్మల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న చైతన్యపురి మెట్రో పిల్లర్ నంబర్ 1570 సమీపంలోని సరూర్‌నగర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో రిజిస్ట్రేషన్, డెమో ఉంటుందన్నారు. ఉదయం 8 గంటలకు రిజిస్ట్రేషన్, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత సబ్జెక్టుల్లో డెమో నిర్వహించనున్నట్లు వివరించారు. ఇంగ్లిష్, హిందీ, గణితం, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, సాంఘికశాస్త్రం, లైబ్రేరియన్, హెల్త్ సూపర్‌వైజర్, ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ కళాశాలకు సంబంధించి గణితం, బోటని, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్ సబ్జెక్టులకు రిజిస్ట్రేషన్, డెమోలో ఉంటాయని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

క్రీడా పాఠశాలల్లో అడ్మిషన్స్

4వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలు హకీంపేట్– కరీంనగర్, ఆదిలాబాద్‌లలో 2025–26 సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశానికి బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎర్రబెల్లి వెంకటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ మొబైల్ నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. వివరాలకు ఎంఈఓను సంప్రదించాలని సూచించారు. ఈ నెల 23న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ ఎంపిక ఉంటుందన్నారు. 2016.9.1 నుంచి 31.8.2017 మధ్య జన్మించిన విద్యార్థులు జనన, కుల ధ్రువీకరణ, ఆధార్, ప్రోగ్రెస్ కార్డు, కొత్త బోనాఫైడ్ సర్టిఫికెట్, పాస్‌ఫొటోలతో హాజరవ్వాలన్నారు. విద్యార్థుల ఎత్తు, బరువు పరిగణనలోకి తీసుకుని 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 800 మీటర్ల రన్, షటిల్ రన్, మెడిసిన్ బాల్‌త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్టులు నిర్వహించనున్నామని, ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

సీఎంను కోరిన మాజీ మేయర్ దంపతులు



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పారిజాత నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేలా చూడాలని మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారి వెంట ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మాలలు ఐక్యంగా పోరాడాలి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాలమహానాడు జిల్లా కమిటీ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకునేందుకు మాలలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పల్లెపల్లెకు మాలల చైతన్యయాత్ర కార్యక్రమానికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలపై వివక్ష చూపుతున్నాయని ఆరోపించారు. రోజురోజుకు మాలలపై దాడులు పెరిగిపోతున్నాయని.. విషప్రచారం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ మౌనంగా ఉంటే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సమస్యల పరిష్కారంకోసం మాలలంతా ఏకతాటిపైకి వచ్చి ఐక్యంగా పోరాడాలన్నారు. గ్రామ కమిటీలు, మండల కమిటీలు వేసుకొని సంఘాన్ని బలోపేతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహేశ్, నర్సింలు, శేఖర్, అశోక్, జగన్ పాల్గొన్నారు.

❖ నాన్న నడిపించాడు.. నన్ను గెలిపించాడు



శశికాంత్

షాద్‌నగర్: వేలు పట్టి నడిపించాడు... అక్షర ప్రపంచాన్ని పరిచయం చేశాడు.. అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు అండగా నిలిచాడు.. తాను ప్రస్తుతం లేకపోయినా నా నీడగా ఉంటూ నన్ను గెలిపించాడు.. అంటూ తన తండ్రి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాడు సివిల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఐఆర్ఎస్ సాధించిన కొర్రావత్ శశికాంత్. తన తండ్రి ప్రస్తుతం భౌతికంగా లేకున్నా తన హృదయంలో తనకు జీవితాన్ని, భవితవ్యాన్ని ఇచ్చిన వ్యక్తిగా ఎప్పటికీ గుర్తుంటాడని చెబుతున్నాడు ఈ ఐఆర్ఎస్ అధికారి.



నాన్న రాములు నాయక్‌తో శశికాంత్

సొంతూరిని విడిచి..

మాది మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం గ్రామ పరిధిలోని చాకలిదాని తండా. తల్లిదండ్రులు రాములు నాయక్, సీతమ్మలకు రెండవ సంతానం. తనకు అన్న నీలిమ, తమ్ముడు శ్రీకాంత్ ఉన్నారు. ఉన్నత చదువుల కోసం షాద్‌నగర్‌కు తీసుకొచ్చాడు. హాస్టల్‌లో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తూ చదివించాడు. తమను భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో చూడాలన్నది ఆకాంక్ష. అందుకు ఆయన ఎంతో శ్రమించారు.

అప్పుడే నిర్ణయం తీసుకున్నా

నాన్న ప్రతి రోజు నా వెంట పాఠశాలకు వచ్చేవారు. చదువుల్లో రాణించి మంచి మార్కులు సాధించాలని చెప్పేవారు. ఏ చిన్న సందేహం వచ్చినా వెంటనే ఉపాధ్యాయులను అడగాలని సూచించేవారు. ఎంతో గారాబంగా పెంచారు. 8వ తరగతి వరకు షాద్‌నగర్‌లో పూర్తి చేసిన తర్వాత 9,10 వట్టెం నవోదయలో చేర్పించాడు. అప్పుడే నేను సివిల్స్ వైపు దృష్టి సారించాను. నాన్న ఆశయాలను నెరవేర్చాలని నిర్ణయించుకున్నాను. అనంతరం ఇంటర్ హైదరాబాద్ వికాస్‌లో, బీటెక్ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో పూర్తి చేశా.

గెలుపు చూడకుండానే విడిచి వెళ్లిపోయాడు

తనను ఉన్నత స్థానంలో నిలిపేందుకు నాన్న అన్ని విధాలా ప్రోత్సహించారు. 2008 బీటెక్ చదువుతుండగా ఆయన అకాల మరణం కలిచివేసింది. నాన్న లేరనే విషయాన్ని ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నాను. అమ్మ ప్రోత్సాహంతో సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఇండియన్ రైల్వే సర్వీస్‌లో ఉద్యోగం సాధించా. నేను సాధించిన లక్ష్యాన్ని నాన్న చూసి ఉంటే ఎంతో సంతోష పడేవాడు.

సత్తాచాటిన కీర్తన



బడంగ్‌పేట్: బడంగ్‌పేటకు చెందిన గుడ్ల రాధ, శ్రీనివాస్ దంపతుల కూతురు కీర్తన నీట్ ఫలితాల్లో 468 ర్యాంకుతో సత్తాచాటింది. ఉస్మానియా, లేదా గాంధీ మెడికల్ కాలేజీలో తనకు ఎంబీబీఎస్ సీటు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, స్థానికులు ఆమెను అభినందించారు.

నాన్నే.. మా హీరో

సాక్షి ప్రత్యేకం

ప్రేమ, త్యాగానికి ప్రతిరూపం నాన్న.. తాను కొవ్వొత్తిలా కరుగుతూ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అహర్నిషలు కష్టపడే శ్రామికుడు నాన్న.. జీవన ప్రయాణంలో తన స్వార్థం కోసం చూసుకోకుండా.. బిడ్డలను ఒడ్డున చేర్చేందుకు పరితపించే నావికుడు నాన్న.. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలనే తపనతో.. చివరి శ్వాస వరకూ రక్తమాంసాలను కరిగించే యోధుడు నాన్న.. ఎన్ని జన్మలైనా.. ఎంత సేవ చేసినా తీర్చుకోలేని రుణం నాన్న.. అందుకే నాన్నా.. మీరే మా హీరో. ఆదివారం జాతీయ పితృ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనాలు..



ఏడుగురు కుమారులతో బిచ్చన్న

❖ 'సెవెన్ స్టార్' బిచ్చన్న

కొడంగల్ రూరల్: పట్టణానికి చెందిన బిచ్చన్న – విజయలక్ష్మి దంపతులకు ఏడుగురు సంతానం. దర్జీ వృత్తి చేస్తూ పిల్లలను చదివించారు. ఆ కాలంలో ఏడుగురిని చదివించడమంటే ఆషామాషీ కాదు.. కానీ బిచ్చన్న బెదరలేదు.. పేదరికాన్ని జయించి కొడుకులను ఉన్నత స్థానంలో నిలిపారు. మొదటి కుమారుడు సత్యకుమార్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ, ఐఐసీటీ.., సౌత్‌ఆఫ్రికాలో పోస్టు డాక్ చేశారు. ప్రస్తుతం మస్కట్ దేశంలో యూనివర్సిటీ ఆఫ్ నిజ్వాలో అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ రీసర్చ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రెండో కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఐఐటీ బాంబే, ఎంఎస్సీ గణితం పూర్తి చేసి ప్రస్తుతం మస్కట్ దేశంలో హలీ బ్యాంకులో పని చేస్తున్నారు. మూడో కుమారుడు రవికుమార్ దౌల్తాబాద్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. నాల్గో కుమారుడు అనిల్‌కుమార్ మద్రాస్ ఐఐటీలో పీహెచ్‌డీ పూర్తి చేసి ప్రస్తుతం కెనడియన్ కంపెనీలో రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వాటర్ టెక్నాలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఐదో కుమారుడు శివకుమార్ ఎంబీఏ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఓ ప్రముఖ నగల దుకాణంలో సీనియర్ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నారు. ఆరో కుమారుడు మనోజ్‌కుమార్ ఐఐటీ పూర్తి చేసి ఫీడెక్స్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా రాణిస్తున్నారు. ఏడో కుమారుడు నవీన్‌కుమార్ పాండిచ్చేరి యూనివర్సిటీలో ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ పూర్తి చేసి అపెక్స్ కోవంటిజ్ ఎల్ఎల్‌సా, యూఎస్ కంపెనీలో డాటా ప్రోగ్రామర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పిల్లలందరూ ఉన్నత స్థానాలకు చేరుకోవడంతో బిచ్చన్న సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

❖ ఆయన కష్టమే ఈ జీవితం



దుద్యాల్: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన పిడుగు వెంకటయ్య –మాసనమ్మ దంపతులకు కొద్దిపాటి భూమి ఉంది. దీన్ని సాగు చేసుకుంటూ మరోవైపు వీఆర్ఏ ఉద్యోగం చేస్తూ ముగ్గురు కుమారులను బాగా చదివించారు. ప్రస్తుతం వారు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. పెద్ద కొడుకు తిరుపతి వ్యాపార రంగంలో రాణిస్తున్నారు. రెండో కుమారుడు గోపాల్ విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా బొంరాస్‌పేట్ మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. మూడో కొడుకు శ్రీనివాస్ అబ్కారీ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. నాన్న కష్టమే ఈ రోజు తాము ఉన్నతమైన జీవనం సాగిస్తున్నామని వారు ఆనందం వ్యక్తం చేశారు.

❖ తల్లిలేని లోటు తీర్చాడు..



ఎస్ఐ రమేష్



తండ్రితో..

కుల్కచర్ల: అదో మారుమూల గ్రామం.. అందులో ఒక నిరుపేద రైతు కుటుంబం. చిన్నతనంలోనే తల్లిని కోల్పోవడంతో నాన్నే సర్వంగా మారి తనను ఉన్నత స్థానంలో నిలిపాడు.. ఆయనే నాకు స్ఫూర్తి అని కుల్కచర్ల ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు. కొందుర్గు మండలం కాస్లాబాద్‌కు చెందిన వన్నెగూడ సత్యయ్యకు ఒక కుమారుడు. భార్య చాలా ఏళ్ల క్రితమే చనిపోయింది.. కొడుకు రమేష్‌ను బాగా చదివించి ఉన్నత స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. అందుకోసం ఎంతో శ్రమించారు. తండ్రి శ్రమను గుర్తించిన రమేష్ అంతే పట్టుదలతో చదివి ఎస్ఐ ఉద్యోగం సాధించారు. తన ఎదుగుదలకు నాన్నే కారణమని, ఆయన స్ఫూర్తితోనే ఈ స్థాయికి చేరుకోగలిగానని గర్వంగా చెప్పారు. రమేష్ ప్రస్తుతం కుల్కచర్ల ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. నాన్న చూపిన మార్గంలోనే ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

❖ తండ్రి కష్టాలు చూస్తూ పెరిగాం



యాలాల: ఒక వైపు పేదరికం .. మరోవైపు కుటుంబ భారం .. అయినా బెదరకుండా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించారు ఆ తండ్రి. నాన్న పడిన కష్టానికి ప్రతిఫలంగా నేడు ఆయన పిల్లలు ఉన్నత స్థాయిలో నిలదొక్కుకున్నారు. యాలాల మండల కేంద్రానికి చెందిన లక్ష్మీనారాయణ, భారతి దంపతులకు నలుగురు కొడుకులు, ఒక కూతురు. డిగ్రీ వరకు చదువుకున్న ఆయన ప్రైవేటు పాఠశాలలో విధులు నిర్వహిస్తూ, పాల బూత్‌ను నిర్వహిస్తూ పిల్లలను చదివించారు. నేడు నలుగురూ ఉన్నత స్థాయిలో నిలిచారు. పెద్ద కొడుకు కేశవ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, శివ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, కమల్ హాసన్ పంచాయతీరాజ్ శాఖలో ఏఈగా, విజయ్ రతన్ కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి కంటి విభాగంలో ఉద్యోగం చేస్తున్నారు. నాన్న పడ్డ కష్టానికి ప్రతిఫలమే తాము అని నలుగురు కుమారులు పేర్కొన్నారు.



చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ.. ఆటపాటల బడి

- ప్రీ ప్రైమరీ విద్యపై అవగాహన కార్యక్రమాలు
- ప్రవేశాలు పెంచేందుకు స్పెషల్ ఫోకస్
- 17 వరకు 'అమ్మమాట–అంగన్‌వాడీబాట'

షాద్‌నగర్: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రీప్రైమరీ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ టీచర్లు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 17వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

సులువైన బోధన

అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి చిన్నారుల ప్రవేశాలను పెంచేందుకు ఐసీడీఎస్ (సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. బడిబాట కార్యక్రమం పూర్తైన తర్వాత గ్రామాల్లో, పట్టణాల్లో బడికి రాకుండా మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి వారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించనున్నారు. వారికి అక్షరాలు, అంకెలు, పాటలతో కూడిన విద్యను బోధించనున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధిస్తున్న సిబ్బంది

కార్యక్రమాలు ఇలా

అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు, సమావేశాలు, సామూహిక కార్యక్రమాలు, స్వచ్ఛ అంగన్‌వాడీ, పెరటి తోటల పెంపకంతో పాటుగా సామూహిక అక్షరాభ్యాసాలు వంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు.

సేవల పై ప్రచారం

గ్రామాల్లో, పట్టణాల్లో మూడేళ్లు పైబడిన చిన్నారులను గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. కొత్తగా పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పిస్తున్నారు. ఐదేళ్లు దాటిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు.

జిల్లాలో 7 ప్రాజెక్టులు

షాద్‌నగర్, ఆమన్‌గల్లు, మహేశ్వరం, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, చేవేళ్ల, ఇబ్రహీంపట్నంలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో 1,600 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పెద్దవి 1,380, చిన్నవి 220 ఉన్నాయి. ఇందులో సుమారు 1.30లక్షల మంది చిన్నారులకు విద్యతో పాటు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుంది.

భాగస్వాములు కావాలి



అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు రోజుకు ఒక ప్రత్యేక కార్యక్రమం తీసుకుని ముందుకు వెళ్తున్నాం. కార్పొరేట్‌కు దీటుగా చిన్నారుల వయసుకు తగిన విధంగా సులువైన పద్ధతుల్లో బోధిస్తున్నాం. ఇందులో ప్రజలంతా భాగస్వామ్యం కావాలి.

– షబానా బేగం, సీడీపీఓ, షాద్‌నగర్

కేసుల పరిష్కారానికి రాజీయే మార్గం

సీనియర్ సివిల్ కోర్టు జడ్జిలు దశరథరామయ్య, శ్యాంకుమార్

ట్రాఫిక్ పోలీస్ కేసులు		
డ్రంకెన్ డ్రైవ్	544	రూ.10,76,500
లైసెన్స్, రిజిస్ట్రేషన్	222	రూ.2,96,500



చేవెళ్ల కోర్టు ఆవరణలో కొనసాగుతున్న మోగా లోక్ అదాలత్

చేవెళ్ల: రాజీమార్గం ద్వారా కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ కోర్టు జడ్జిలు దశరథరామయ్య, జె.శ్యాంకుమార్, రిటైర్డ్ జడ్జి కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం చేవెళ్ల కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షణికావేశంలో గొడవలు, ఘర్షణల కారణంగా సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. భార్యాభర్తల కేసులు, కుటుంబ తగాదాలు, భూ సంబంధిత విషయాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని చెప్పారు.

1,271 కేసులకు రూ.16.62లక్షల జరిమానాలు

చేవెళ్ల కోర్టు ఆవరణలో ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన లోక్ అదాలత్‌లలో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించామన్నారు. ఆరు రోజుల్లో 1,271 కేసులు పరిష్కరించగా రూ.16,62,690 జరిమానా విధించామన్నారు. ట్రాఫిక్ విభాగానికి సంబంధించి 766 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. సివిల్, క్రిమినల్, పిట్టి కేసులకు పరిష్కారం చూపామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సూపరింటెండెంట్‌లు ఈ.మహిపాల్, బి.కృష్ణవేణి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కె.కుమార్. సీఐ భూపాల్‌శ్రీధర్, ట్రాఫిక్ ఏఎస్ఐ చందర్‌నాయక్, అడ్వకేట్స్ బి.కృష్ణ గౌడ్, బి.మల్లేశ్‌గౌడ్, నర్సింలు, ఉపేందర్, శేఖర్, సిబ్బంది అనిల్‌కుమార్, నర్సింలు, ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

152 కేసులకు పరిష్కారం



ఆమనగల్లు: మాట్లాడుతున్న జడ్జి స్వరూప

ఆమనగల్లు: పట్టణంలోని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో 152 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ స్వరూపకాటం మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు రాజీపడి కేసులను పరిష్కరించుకోవాలన్నారు. కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీపడి పరిష్కరించుకుంటే ఇరువర్గాలు గెలిచినట్లేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ కార్తీక్, సీఐ జానకీరాం రెడ్డి, గంగాధార్, వేణుగోపాల్, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్, ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే 'పాలమూరు–రంగారెడ్డి'

మాజీ సీఎం, ప్రస్తుత సీఎంకు కుర్చీ దొరకడం లేదా?

- కేంద్రంపై దుష్ప్రచారం మానుకోవాలి
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

షాద్‌నగర్‌రూరల్: నల్లమల బిడ్డనని చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం ఎందుకు చేపట్టడంలేదని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఇక్కడ ఎంపీగా గెలిచిన కేసీఆర్ తాను పాలమూరు బిడ్డనని ప్రచారం చేసుకుని ప్రాజెక్టును ఒక్క అడుగు కూడా ముందుకు తీసుకెళ్లలేదని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను అనుసరిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలనపై బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఓట్లకోసం గతంలో కేసీఆర్, ఇప్పుడు రేవంత్‌రెడ్డి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని ఓట్ల రాజకీయం చేశారని, తీరా ఎన్నికల్లో గెలిచాక పాలమూరును పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. కుర్చీ వేసుకుని లక్ష్మీదేవిపల్లిని నిర్మిస్తామని చెప్పిన ఇద్దరు నాయకులకు ఇప్పటి వరకు కుర్చీ దొరకలేదా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతోందని తాను ఆనాడే చెప్పినా ఎవరూ పట్టించుకోలేదని, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పాలనపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాలను మానుకోవాలన్నారు. పీఎం మోదీ 11ఏళ్ల పాలనలో పేదలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను తీసుకువచ్చారని అన్నారు. యువత, నిరుద్యోగులు, కార్మికులు, మహిళలు ఇలా అన్ని వర్గాలకు తమ ప్రభుత్వ హయాంలో ఎన్నో ప్రయోజనాలు చేకూరాయని స్పష్టం చేశారు. కులగణన చేయాలని పట్టుబడుతున్న రాహుల్‌గాంధీ బీజేపీ అవకాశం ఇచ్చిన ఎంపీలు, ఎమ్మెల్యేలను చూడాలని, 80శాతం ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళలు ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కుంభకోణాల పార్టీఅని, బీజేపీ పారదర్శకంగా పని చేసే పార్టీ అన్నారు.

ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు బుద్ధి చెప్పింది

ఆపరేషన్ సిందూర్‌తో మన దేశం పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పిందని రఘునందర్‌రావు అన్నారు. ఈ దాడిపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్, డాక్టర్ ప్రేమ్‌రాజ్, బొక్క నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, బోసుపల్లి ప్రతాప్, శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కక్కునూరి వెంకటేష్ గుప్తా, డాక్టర్ టంగుటూరి విజయ్‌కుమార్, అశోక్‌గౌడ్, చెట్ల వెంకటేష్, భూపాలచారి, మనోహర్‌రెడ్డి, ప్యాట అశోక్, వెంకటేష్, ప్రశాంత్, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

ఇద్దరు కూతుళ్లతో సహా తల్లి అదృశ్యం

కేశంపేట: కుమారుడితో గొడవపడిన ఓ తల్లి తన ఇద్దరు కూతుళ్లతో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయింది . ఈ ఘటన మండల పరిధిలోని వేములనర్వ శివారులో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన డోల శేఖర్, సుజాత(40) దంపతులకు నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ల సంతానం. ఈ నెల 2న రాత్రి సుజాత పెద్ద కుమారుడు అభిలాష్‌తో గొడవపడింది. 3వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన కూతుళ్లు గౌతమి(5), ప్రవళిక(2)ను తీసుకుని ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త శేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం





అక్రమ నిర్మాణాలను జేసీబీతో కూల్చివేయిస్తున్న తహసీల్దార్ అన్వర్

- షాబాద్ తహసీల్దార్ ఎండీ అన్వర్
- హైతాబాద్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

షాబాద్: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని షాబాద్ తహసీల్దార్ ఎండీ అన్వర్ హెచ్చరించారు. మండల పరిధిలోని హైతాబాద్ గ్రామ శివారు సర్వే నంబర్ 8లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శనివారం ఆయన కూల్చివేయించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో కొంతమంది వ్యాపారాలకు అనుగుణంగా కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు కనిపిస్తే వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. 111 జీవోలో కూడా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయమై ఎంపీడీఓ, ఎంపీఓకు సమాచారం అందించామని స్పష్టంచేశారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గంజాయి విక్రేతకు రిమాండ్



పోలీసుల అదుపులో రవీందర్‌పాశ్వాన్

నందిగామ: కార్మికులకు గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన శనివారం నందిగామ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బీహార్ రాష్ట్రం బాక్సర్ జిల్లాకు చెందిన రవీందర్ పాశ్వాన్ కొంతకాలం క్రితం నందిగామకు వలస వచ్చి స్థానిక పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తన సొంతూరునుంచి గంజాయి తీసుకువచ్చి స్థానికంగా ఉంటున్న కార్మికులకు విక్రయిస్తూ అక్రమ సంపాదనకు అలవాటుపడ్డాడు. ఉదయం పారిశ్రామిక వాడ సమీపంలోని చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఆయన వద్ద 500 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. దీంతో నిందుతుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మామిడి పండ్ల లారీ బోల్తా



బోల్తా పడిన లారీ



ప్రమాదం కారణంగా ఏర్పడిన ట్రాఫిక్ అంతరాయం

డ్రైవర్‌కు గాయాలు

- నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్



గాయపడిన డ్రైవర్

కొత్తూరు: మామిడి పండ్ల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ చేగూరు కూడలి జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా నుంచి మామిడిపండ్ల లోడ్‌తో ఢిల్లీ వెళ్తున్న లారీ చేగూరు కూడలి వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం కారణంగా తిమ్మాపూర్ నుంచి శంషాబాద్ వైపు వెళ్లే రోడ్డులో నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. లారీ బోల్తా పడగానే పలువురు వాహనదారులు, ప్రజలు మామిడి పండ్లను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో లారీను తప్పించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ప్రమాదంపై ఏలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ నర్సింహ్మారావు తెలిపారు.

పెంజర్ల కూడలిలో..

షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ లారీ పెంజర్ల కూడలి సమీపంలో అదుపు తప్పి, బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ నర్సింహ్మారావు తెలిపారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

11 ద్విచక్ర వాహనాల రికవరీ



పోలీసులు రికవరీ చేసిన బైక్‌లు

శంకర్‌పల్లి: ద్విచక్ర వాహనాలు చోరీ చేసి డూప్లికేట్ ఆర్‌సీలతో బైక్‌లు విక్రయిస్తున్న ఇద్దరు దొంగల ఆటకట్టించారు శంకర్‌పల్లి పోలీసులు. వారి వద్ద నుంచి 11 బైక్‌లను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను శంకర్‌పల్లి ఠాణాలో నార్సింగి ఏసీపీ రమణగౌడ్, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ విలేకరులకు వెల్లడించారు. శంకర్‌పల్లితోపాటు పరిసర ప్రాంతాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతన్న దొంగలపై పోలీసులు స్పెషల్ టీంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి 10గంటల సమయంలో విశ్వసనీయ సమాచారం మేరకు శంకర్‌పల్లి డబుల్ బెడ్రూం ఇళ్లలో నివాసం ఉండే బొగ్గ శ్రీనివాస్‌కు చెందిన మూడు బైక్‌లను తనిఖీ చేశారు. బైక్ నంబర్లు, చాయిస్ నంబర్లు తేడా ఉండటంతో పోలీసులు ప్రశ్నించగా అసలు విషయం బయటపడిందన్నారు. శ్రీనివాస్ నాలుగు నెలలుగా మెహదీపట్నం, అత్తాపూర్, గుడిమల్కాపూర్, నార్సింగి, శంకర్‌పల్లి తదతర ప్రాంతాల్లో మొత్తం 11 బైక్‌లను చోరీ చేసినట్లు తెలిపారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీల బాగోతం బట్టబయలైందన్నారు. చోరీ చేసిన బైక్‌లను పోలిఉండే కంపెనీ, కలర్, మాడల్ ఇతర బైకుల నెంబర్ ప్లేటు, చాయిస్ నంబర్ల ఫోటోలు తీసి ఆర్టీఏ వ్యాలెట్ ద్వారా డూప్లికెట్ ఆర్‌సీసీ తయారు చేసి నకిలీ ఆర్‌సీతో తన స్నేహితుడు నాగరాజు ద్వారా బైక్‌లను అమ్మించి డబ్బులు తీసుకునేవాడనని తెలిపారు. ఈ మేరకు శ్రీనివాస్‌ను, నాగరాజును రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసును ఛేదించిన శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్‌ను, దొంగలను పట్టుకునేందుకు పని చేసిన టీంను ప్రత్యేకంగా అభినందించారు.

బీజాపూర్ హైవే పరిశీలన

ప్రమాదాలకు నిలయంగా మారిందని

సీపీఐ నాయకుల మండిపాటు



హైవేపై గుంతలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల: హైదరాబాద్-బీజాపూర్ రహదారి ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. శనివారం 'సాక్షి'దినపత్రికలో ప్రచురితమైన 'ప్రమాదాలకు హైవే' కథనంపై స్పందించిన సీపీఐ నాయకులు గుంతల రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్లు గడుస్తున్నా పాలకులు రోడ్డు మరమ్మతులపై దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య నిత్యం ఇదే రోడ్డుపై ప్రయాణిస్తున్న అధికారులతో మాట్లాడి బాగు చేయించాలనే సోయి లేకపోవడం బాధాకరమన్నారు. స్థానిక కేజీఆర్ గార్డెన్ ఎదుట ఏర్పడిన గుంతలు చెరువులను తలపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని లేదంటే రహదారి దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో సీపీఐ నాయకులు ప్రభులింగం, వడ్ల సత్యనారాయణ, సత్తిరెడ్డి, మక్బుల్, మంజుల, లలిత, పెంటయ్య, యాదగిరి, తదితరులు ఉన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్



మాట్లాడుతున్న రాజ్‌భూపాల్‌గౌడ్

కొత్తూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ మినీ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి రాజ్‌భూపాల్‌గౌడ్, అందెబాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందుతూ ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. ఈ ఘటన తర్వాత ప్రపంచంలోనే 4వ ఆర్థిక దేశంగా తయారు కావడం గొప్ప విషయమన్నారు. ఉగ్రవాద చర్యలతో దేశంలో అస్థిరత, ఘర్షణ, ఆర్థికంగా దెబ్బతీయాలని చూసిన పాకిస్తాన్‌కు మన సైన్యం తగిన గుణపాఠం చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు అశోక్‌గౌడ్, మాణిక్యం, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు

పేదలకు ఫీజులో రాయితీ కల్పించాలి



శ్లోక్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న మండలి చైర్మన్ గుత్తా, ఎంపీ రఘునందన్‌రావు తదితరులు

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

తుక్కుగూడ: విద్యార్థులు ఇష్టపడి చదువుకుని ఉన్నతంగా రాణించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావుతో కలిసి మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ గుత్తా మాట్లాడుతూ.. మారుతున్న కాలానుగుణంగా విద్యాసంస్థలు విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ప్రతీ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ప్రారంభిస్తుందన్నారు. యాజమాన్యాలు సేవా దృక్పథంతో పాఠశాలలు నడిపించాలన్నారు. పేదలకు ఫీజులో రాయితీ కల్పించి కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలలో చదువుకునే అవకాశం కల్పించాలని సూచించారు. అనంతరం ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పిల్లలపై ఒత్తిడి పెంచొద్దన్నారు. వారికి ఇష్టమైన రంగం, అభిరుచి, ఆసక్తికి అనుగుణంగా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, దేప భాస్కర్ రెడ్డి, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, శ్లోక విద్యా సంస్థల చైర్మన్ బిట్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ చింతల సంగమేశ్వర్‌గుప్తా, డైరెక్టర్ తేలుకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.